విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి నెం. 5
సోమవారం 21, జూలై 2025

'మిస్టర్ ఆంధ్ర' గోల్డ్ మెడల్ సాధించిన అక్కిరెడ్డిపాలెం యువకుడు

విశాలాంధ్ర-పెదగంట్యాడ : 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి షణ్ముఖ రామకృష్ణ మాజీ నేవీ మరియు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సిఎస్ఏగా విధులు నిర్వహిస్తున్నారు. జూలై 13 వ తేదీన కడపలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ కాంపిటీషన్లో గోల్డ్ మెడల్‌ను సాధించి అక్కిరెడ్డిపాలెం గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా వై టరిన్ వారియర్స్ ఎక్స్ డిఫెన్స్ పర్సన్స్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ డిఫెన్స్ సర్వీసెస్ మాన్ కమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఒక్క ఏడాదిలోనే గ్రామాల రూపురేఖలు మార్చి చూపించాం

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

- రాంపురంలో రూ. 2.25 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర-పెందుర్తి : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే గ్రామాల రూపురేఖలు మార్చి చూపించామని ప్రతి గ్రామం అభివృద్ధి చెంది కళకళలాడుతోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సీనియర్ నాయకులు జామి గంగు నాయుడు, మాజీ జెడ్పిటిసి రెడ్డి నారాయణరావు, ఎంపిటిసి గండి హిమబిందు, సీనియర్ నాయకుడు గండి భూషణం ఆధ్వర్యంలో 2 కోట్ల 25 లక్షలతో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రోడ్లు, డ్రైన్లు ప్రారంభించి, శ్రీరాంపురం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించబోతున్న వాటర్ ట్యాంక్, అంగన్వాడీ బిల్డింగుల ప్రారంభోత్సవ కార్యక్రమాలలో ఎమ్మెల్యే రమేష్ బాబు పాల్గొన్నారు. గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే రమేష్ బాబుకు రాంపురం టిడిపి జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు భారీ ఎత్తున విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో పార్టీలు, ప్రాంతాలు అనే భేదం లేదని, ఎన్నికలు జరిగేటప్పుడు మాత్రమే రాజకీయాలు, విమర్శలు, ప్రతి విమర్శలు తప్ప గెలిచిన తర్వాత ప్రజలు తమకి ఇచ్చిన ఐదేళ్ల కాలంలో వారికి ఎంత అభివృద్ధి చేసి చూపించామన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. కొంతమంది నాయకులు కొన్ని పత్రికలు గత వైసిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామంటూ చేస్తున్న విమర్శలను ఖండించిన ఎమ్మెల్యే రమేష్ బాబు, ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలన గురించి వారికి తెలియకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం తాను ఎన్ని పరుగులు పెట్టానో కొంతమందికే తెలుసునని, ఏడాదిలో 229 కోట్ల అభివృద్ధి పనులు చేసుకున్నామంటే దానికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఎంత నిబద్ధత పనిచేస్తున్నారో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఎవరు ఎన్ని అనుకున్నా కూటమిలో ఉన్న మూడు పార్టీల నాయకులు కలిసి మెలిసే ఉన్నామని, కలిసికట్టుగానే ప్రజలకు అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. ఒక్క పంచాయతీలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగడానికి స్థానిక నాయకత్వం పట్టుదల కూడా కారణమని ఆయన వివరించారు. రాంపురం గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు సహా ప్రజల కోరిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను

మరో ఏడాది కాలంలో పూర్తి చేస్తానని సభా వేదికగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలరాజు, పంచాయతీరాజ్ అధికారులు పీవీ రమణమూర్తి,లక్ష్మణ్ రావు, ఆర్డబ్ల్యుసి ఏఈ సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ నియోజవర్గ కన్వీనర్ గొర్లె రాము నాయుడు, మండలం ఎంపీపీ నాగమణి, జడ్పిటిసి ఇప్పిలి దేవి, సరివల్లి ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రాము నాయుడు కర్రి కనకరాజు, సీనియర్ నాయకులు అయితి సింహాచలం నాయుడు, జగన్మోహన్ పాత్రుడు, బయలుపూడి హర గోపాల్, ఉగ్గిన రాము, సియాద్రి అప్పలరాజు, గొరపల్లి సత్యా రావు, మంతా నాగ సుధా, వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, రాపర్తి కిషోర్, బంతి కోళ్ల పద్మా, కర్రీ నరసింగరావు, ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సింహాద్రి నాధుని దర్శించుకున్న పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. మాడుగుల నాగఫణి శర్మ

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని ఆదివారం ప్రముఖ అవధాని, భారతీయ సాహిత్య సాంప్రదాయ పరిరక్షకులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.మాడుగుల నాగఫణిశర్మ తన సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆదేశాలమేరకు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి. కె.తిరుమలేశ్వరరావు పుష్పమాల వేసి స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, వేద పండితులు, నాదస్వర స్వరాలతో వేద మంత్రోచ్చారణ నడుమ ఘనంగా ఆహ్వానం పలికారు. మాడుగుల నాగఫణి శర్మ దంపతులు ఆలయ కప్పస్తంభం ఆలింగనం చేసుకుని, బేడ మండప ప్రదక్షిణ చేసి, స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. ప్రత్యేక పూజ. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. పిదప ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి స్వామివారి శేషవస్త్రంతో నాగఫణి శర్మ దంపతులను సత్కరించి, దేవస్థానం తరవున ప్రసాదం జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి జి.వి.ఎస్.కే ప్రసాద్, అర్చక స్వాములు పాల్గొన్నారు.

నేడు జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం' 2025 జులై 21వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై జులై 21వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియ పరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

రూ.25 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడాలి : ఇప్పిలివానిపాలెం ప్రజల నిరసన

విశాలాంధ్ర-పెందుర్తి : 25 కోట్ల ప్రభుత్వ భూమిని అడ్డగోలుగా గ్రామానికి సంబంధం లేని వ్యక్తికి ధారా దత్తం చేశారంటూ పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీ ఇప్పిలివానిపాలెం గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. చింతకుంట్ల గ్రామ సర్పంచ్ భర్త గనిశెట్టి కనకరాజు, ఎంపీటీసీ అప్పలరాజు, గ్రామ టిడిపి అధ్యక్షుడు ఇప్పిలి అప్పలరాజు ఆధ్వర్యంలో ఇప్పిలివానిపాలెం కూడలిలో నిరసన చేపట్టి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చింతగట్ల పంచాయతీ సర్వే నెంబర్ 81 /2 లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి సంబంధం లేని దిగుమర్తి మారుతి కుమార్ పేరిట దఖలు పడినట్లు అధికారులు ధ్రువపత్రాలు మంజూరు చేయడం దారుణం అని విమర్శించారు. దీనిపై స్థానికులు కొందరు వారికి వత్తాసు పలకడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వభూమిని కాపాడాలంటూ జిల్లా కలెక్టర్, పెందుర్తి ఎమ్మార్వోలకు ఫిర్యాదు చేసామని అధికారులు చర్యలు చేపట్టకపోతే నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుతం రాజకీయాలు మాట్లాడదలచుకోలేదని గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిని కాపాడటమే తమ లక్ష్యం అని వారు పేర్కొన్నారు. తాము కూడా ఎన్డీఏ కూటమిలోనే ఉన్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఇప్పిలివానిపాలెం భూ సమస్యను తీసుకెళ్తామని తెలియజేశారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి దిగుమర్తి కుమార్ కు ఇచ్చిన భూ హక్కు పత్రాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మరమ్మతులు చేపట్టారు... పూడ్చడం మానేశారు!

విశాలాంధ్ర-మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 63వ వార్డు కూడలిలో కాకరలావ గ్రామం రామ మందిరం ప్రాంతంలో రహదారి ఇరువైపులా కాలువలు మరమ్మతు చేపట్టినప్పటికీ వాటిని సుమారు నాలుగైదు నెలల నుంచి అవి పూడ్చడం లేదని, వాటి వలన ప్రజలు ప్రమాదాలకు గురౌతున్నారని సదరు గుత్తేదారుడు త్వరగా వచ్చి పని పూర్తిచేయాలని ప్రజలందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకులు, జీవీఎంసీ అధికారులను డిమాండ్ చేస్తుంది.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి

- కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : 21వ తేదీన అనగా సోమవారం విశాఖపట్నం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సాప్ లో అందజేస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి... అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు...

- బిల్లుకు అదనంగా ఎటువంటి ఛార్జీలు ఉండవు

- వినియోగం, బిల్లు నియంత్రణ వినియోగదారుల చేతుల్లోనే

- ఏపీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు ఛార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. ఈమేరకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవలలో పారదర్శకతను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్ డి ఎస్ ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాలలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందని అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లతో మార్చాలనే ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరి లో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామని చెప్పారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా అమర్చుతున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవు... స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదుకానీ, ఛార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించవలసిన అవసరం లేదని సీఎండి తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ బిల్లుతో పాటు నెలవారీగా ఎటువంటి ఇన్స్టాల్ మెంట్లు వసూలు చేయమని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులపై విపరీత భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి కారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు.

మరింత పారదర్శకత పెరుగుతుంది... పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని సీఎండి పేర్కొన్నారు. వినియోగదారులకు ప్రస్తుత విద్యుత్ విని యోగాన్ని పర్యవేక్షించడానికి, వినియోగాన్ని సరిపోల్చుకోవ డానికి స్మార్ట్ మీటర్లు సహకరిస్తాయన్నారు. స్మార్ట్ మీటర్ కన్స్యూమర్ యాప్ ద్వారా 24x7 కనెక్ట్ అయి ఉంటాయని, ఫలితంగా వినియోగదారులు తమ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసు కోవచ్చని చెప్పారు. పైగా అధిక వినియోగాన్ని నియంత్రించుకొంటూ విద్యుత్ బిల్లులను తగ్గించుకొనేందుకు సహకరిస్తాయని అన్నారు. పవర్ ట్రిప్ అయిన సమయంలో త్వరితగతిన గుర్తించి తద్వారా విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధ రించేందుకు వీలు కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో వినియోగదారులకు సహాయపడటానికి సంబంధించిన వివిధ రకాల స్మార్ట్ వినియోగ అలెర్టను ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) వారు నిర్ణయించిన టారీఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని పేర్కొన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్ కు చేరవేస్తామని చెప్పారు. ఈ-బిల్‌లో వినియోగదారులు వినియోగించిన యూనిట్లు, వాటికి చెల్లించవలసిన ఛార్జీలు మొదలైన వివరాలు సవివరంగా తెలియ చేస్తామన్నారు. విద్యుత్ వినియోగం, ఖర్చుపై పూర్తి నియంత్రణ వినియోగదారుల చేతుల్లో ఉండటం వలన విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు సహాయకరిస్తాయన్నారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తికోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సంప్రదించవచ్చని సీఎండి పృథ్వీతేజ్ తెలిపారు.

క్రీడా గాయాలపట్ల జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర-విశాఖపట్నం : వారాంతపు క్రీడలు, జిమ్ వ్యాయామాలు మరియు మారథాన్ సంస్కృతి పెరుగుతున్న కొద్దీ, ముఖ్యంగా అమెచ్యూర్ ఫిట్‌నెస్ ఔత్సాహికులలో క్రీడలకు సంబంధించిన గాయాలు పెరుగుతున్నాయని వీటి పట్ల జాగ్రత్త వహించాలని లయన్స్ క్యాన్సర్ జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి ఉమామహేశ్వరరావు సూచించారు. ఏదైనా క్రీడ ఆడుతున్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండటం ఈ సమయంలో అవసరం. క్రింద ఇవ్వబడిన ముఖ్యమైన చిట్కాలను అనుసరించండి. ప్రస్తుతం, పెరుగుతున్న ఫిట్‌నెస్ సంస్కృతి వారాంతపు ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, జిమ్ సెషన్‌లు మరియు సిటీ మారథాన్‌లలో కూడా పాల్గొనడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడం మంచిది. కానీ ఈ చురుకైన జీవనశైలితో పాటు, క్రీడా గాయాల పెరుగుదల కూడా ఉంటుంది, వాటిలో చాలా తీవ్రమైనవి మరియు తరచుగా నివారించదగినవి. చాలా మంది ఏ సి ఎల్ టి ఆర్ టెన్నిస్ ఎల్బో మరియు చీలమండ బెణుకులు వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ముఖ్యంగా సరైన శిక్షణ లేదా వార్మప్ లేకుండా తీవ్రమైన కార్యకలాపాలలో పాల్గొనే పెద్దలలో ఇది సాధారణం అని చెప్పారు.

ఉక్కు ఎస్సీ, ఎస్టీ కార్యాలయానికి డా.బి.ఆర్. అంబేద్కర్, బుద్దుని సాహిత్యం అందజేత

విశాలాంధ్ర-గాజువాక : వి.ఎస్.పి.ఎస్సీ, ఎస్టీ కార్యాలయానికి సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ సీనియర్ మేనేజర్ ఆర్.టి.అర్ అంబేద్కర్ డా.బి.ఆర్ అంబేద్కర్, బుద్దుని సాహిత్యాన్ని అందజేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సాహిత్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి భయ్యే మల్లయ్య మాట్లాడుతూ సంఘ కార్యాలయానికి అంబేద్కర్, బుద్దుని సాహిత్యంను అందజేయడం శుభపరిణామమన్నారు. ఏప్రిల్, మే జూన్ నెలలో ఉద్యోగ విరమణ చేసిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ఆర్.బి ఎస్ చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ, కోశాధికారి కె.వి.రత్నం, జాయింట్ సెక్రటరీ వేణు గోపాలరావు, ఉక్కు రిటైర్డ్ జి.ఎం.ఎస్.కుమారస్వామి, జి. ఆనంద్, కె.బాలశౌరి, మురళీకృష్ణ, పుష్ప రాజు, రాము, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్ఎంఎస్ జనరల్ మేనేజర్ కుమార్ స్వామి, డబ్ల్యూ ఆర్ ఎం.మురళీకృష్ణ ఇరువురు కలిసి వారికి ఇచ్చిన రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్‌లో వచ్చిన రూపాయలు 12,000/- చొప్పున అసోసియేషన్ ఆఫీసు అసిస్టెంట్ షెడ్డు నిర్మాణం కోసం దానం చేశారు.

రాష్ట్ర ఆర్.టి.ఐ యాక్టివిట్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షునిగా కిలపర్తి తిరుపతిరావు

విశాలాంధ్ర-పద్మనాభం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాక్టివిట్స్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షునిగా పద్మనాభం మండలం కొవ్వాడ పంచాయతీకి చెందిన కిలపర్తి తిరుపతిరావు(శ్రీను) ను నియమించినట్లు ఆయన ఆదివారం పద్మనాభం మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు.అసోసియేషన్ అధ్యక్షులు జి ముత్తు,ఉపాధ్యక్షులు గేదెల శ్రీనులు తనను జిల్లా అధ్యక్షులు గా,అసోసియేషన్ శాశ్వత సభ్యునిగా నియమిస్తున్నట్లు జూలై 14న ఉత్తర్వులు జారీ చేసినట్లు తిరుపతిరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఏ ప్రభుత్వ సంస్థలలో నైనా సామాన్యుడికి సమాచార హక్కు చట్టం ఒక వజ్రాయుధం వంటిదని,సమయం వెచ్చించి సామాన్యుడు ఖర్చు లేకుండా ఒక తెల్ల కాగితం పై వ్రాత తోనే న్యాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.తాను విద్యార్థి దశ ఎన్నో సేవలు అందించానని,బి ఎం ఎస్ ట్రేడ్ యూనియన్ లో పని చేశానని,సామాన్యులకు సంబంధించి 500 ఆర్.టి.ఐ దరఖాస్తులు పెట్టి ఎంతో మందికి న్యాయం చేశానని అది గుర్తించి అధ్యక్ష ,ఉపాధ్యక్షులు తనకు విశాఖపట్నం జిల్లా పదవి ఇచ్చినందుకు వారికి తిరుపతిరావు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా జూలై 26 న గ్రేటర్ విశాఖపట్నం,కంచరపాలెం లో ఉన్న చైతన్య డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి 1:00 వరకు సమాసార హక్కు చట్టం 2025 పై అవగాహన సదస్సు జరుగుతుందని అందరూ ఆహ్వానితులేనని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నూతన జిల్లా అధ్యక్షులు కిలపర్తి తిరుపతిరావు పత్రికా సమావేశంలో తెలిపారు.

పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జగన్నాధరావు మృతి

విశాలాంధ్ర-పెందుర్తి : విశాఖ పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గాజుల జగన్నాదరావు గత రాత్రి స్వర్గస్తులయినట్లు ఆయన కుమారుడు శాంతిశ్వరూప్ తెలియజేసారు. ఆదివారం జగన్నాధరావు అంత్యక్రియలు నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ పెద్దలు డి.కె.శర్మ, బి.వి.రత్నం, కె.మంగయ్య నాయుడు, కె.వి.ఆంజనేయ రావు, గుండు అప్పలరాజు, సిహెచ్.శ్రీనివాస ప్రసాద్, విలియమ్స్, దూడ అప్పలరాజు, అర్జున్, శంకరప్రసాద్, బత్తుల శ్రీనివాస్, సిహెచ్. సత్యనారాయణ, వాడమోదుల రాజు, వెంకట రమణ, అల్లం జగన్నాదం తదితరులు జగన్నాథ రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రామవరంలో సుపరిపాలనలో తొలి అడుగు : ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర-అనందపురం : మండలం రామవరంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన అభివృద్ధిని సంక్షేమాన్ని వివరించే కరపత్రాలను శాసనసభ్యుల గంటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఎన్నికల్లో చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తున్న ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. రూ.2 వేల పెన్షన్ ను రూ.3 వేలు చేయడానికి జగన్మోహన్ రెడ్డికి అయిదేళ్ల పట్టిందని.. అధికారంలోకి వచ్చిన తక్షణమే చంద్రబాబు రూ.3 వేల పెన్షన్ ను రూ.4 వేలు చేశారని గుర్తు చేశారు. అలాగే 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా, కూటమి ప్రభుత్వం దానికి 60 శాతం మించి 67 లక్షల మందికి తల్లికి వందనం అందిస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని వచ్చే నెలలో ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎన్నికల హామీల్లో చెప్పినట్టు నిరుద్యోగ భృతి తొందర్లోనే అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, శ్రీకాంత్ రాజు, గంట్రెడ్డి రమేష్, బలిరెడ్డి మల్లికార్జునరావు, ఎంపీటీసీ కృష్ణ, ఆబోతు అప్పల రాము, రెడ్డి బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌పై మరో ఉద్యమం : సీపీఐ

విశాలాంధ్ర-గాజువాక : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోకపోతే విద్యుత్‌పై మరో ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని సీపీఐ పార్టీ హెచ్చరించింది. స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ఆదివారం గాజువాక మహిళా రైతు బజారులో సీపీఐ శ్రేణులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలపై అధిక భారం పడే స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి, నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, పిల్లా పద్మ పాల్గొన్నారు.

రూ.5.89 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : నగరంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన గాజువాక జోన్ 87 వార్డు పరిధిలోని వడ్లపూడిలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో పారిశ్రామిక ప్రాంతమైన గాజువాకను అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, అందులో భాగంగా 87 వార్డు వడ్లపూడిలో జీవీఎంసీ నిధుల నుండి సుమారు 5.89 కోట్ల రూపాయలతో వి ఆర్ సి సి కాలువలు, దోబీ ఘాటు నిర్మించేందుకు గాజువాక శాసనసభ్యులతో కలిసి శంకుస్థాపన చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్ధి తోపాటు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. గాజువాక ప్రజలకు మౌలిక వసతుల కలపనే లక్ష్యంగా ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ గాజువాక నియోజవర్గం పరిధిలో ప్రతి వార్డును ఆదర్శంగా తీసుకొని ప్రజలకు అందించే సంక్షేమం, మౌలిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అలాగే జీవీఎంసీ నిధులనే కాకుండా ఎమ్మెల్యే నిధులను కూడా వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు నియోజవర్గం పరిధిలో చేపట్టడం జరుగుతుందని శాసనసభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మొల్లి ముత్యాల నాయుడు, రౌతు శ్రీనివాసరావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజనీరు అప్పారావు, ఇతర నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎం.జి.ఎం. ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సేవా కార్యక్రమాల కొనసాగింపు నిమిత్తం కొత్త కార్యవర్గం ఎన్నిక...

విశాలాంధ్ర-విశాఖ సిటీ : మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల(ఎం.జి.ఎం.) పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 1976 నుంచి 1980 వరకు చదివిన 50 మంది పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక చోట కలిసి సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడైన వి.వి.ఎన్. మూర్తి నివాసంలో కలిసిన వీరంతా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యార్థి జీవితం నాటి మధురస్మృతలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా, సరదాగా గడిపిన వారంతా భవిష్యత్తు కార్యాచరణపై చర్చించుకున్నారు.

సేవా కార్యక్రమాల కోసం కొత్త కార్యవర్గం... సేవా కార్యక్రమాలను కొనసాగించే నిమిత్తం పూర్వ విద్యార్థులంతా ఆదివారం జరిగిన వేడుకలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పాత సంఘం స్థానంలో కొత్తగా ముగ్గురిని నియమించుకున్నారు. అధ్యక్షునిగా ఎం. సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా బాలకృష్ణారెడ్డి, కోశాధికారిగా పెంకోట సత్యనారాయణ ఎన్నికయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షునిగా డి.ఎస్.ఎన్. గుప్తా కొనసాగుతారు. కన్వీనర్ నీలాపు రమణారెడ్డి, మీడియా ఇన్చార్జి మణిరామ్, కుర్మేష్, మార్కండేయ శర్మ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్' ఉచిత హోమియో మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-భీమిలి : భీమునిపట్నం, కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 84వ ఉచిత హోమియో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈమెడికల్ క్యాంపులో 88మందికి పరీక్షలు నిర్వహించి ఉచితముగా హోమియో మందులు ఇవ్వడం జరిగిందని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు టి జగన్నాధరావు, టి.జె.మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు కే.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కే.వి.భానోజీరావు, కే.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఫౌండేషన్ సభ్యులు, రాంబాబు, శ్రీనివాసరావు, ఎం.శంకర్, గంధ రాము, కిషోర్, లక్ష్మణ్, సాయి, పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM

E.P.106/2020 IN O.S.776/2019

Between:-
Sri Ramireddy Sai Kumar (Died) & 3 Others ...**Decree Holders**

And:-
Mohd. Shahnawaaz (Died) & 3 Others ... **Judgment Debtors**

NOTICE OF APPEARANCE

To the Judgment Debtors Nos.2 to 4:-
2. Mohd. Farjanavaai W/o. Late Shahnawaaz, Muslim, aged about 58 years, Residing at D.No.49-44-28, Plot No.C3, 3rd Floor, S.S. Towers, Akkayyapalem, Visakhapatnam-16.
3. Mohd. Shazil Nawaz, S/o. Late Shahnawaaz, Muslim, aged about 30 years, Residing at Residing at D.No.49-44-28, Plot No.C3, 3rd Floor, S.S. Towers, Akkayyapalem, Visakhapatnam-530016.
4. Mohd. Yonex Taj, S/o. Late Shahnawaaz, Muslim, aged about 27 years, Residing at D.No.49-44-28, Plot No.C3, 3rd Floor, S.S. Towers, Akkayyapalem, Visakhapatnam-530016.

This is to inform all of you that the above named execution petition is filed by the Dhrs for salary attachment of 1st Jdr under Order XXI Rule 48 of CPC., and being you are all shown as Jdrs Nos.2 to 4, and are legal heirs of deceased 1st Jdr i.e., Md. Shahnawaaz, despite sending notices to you all, for the above address, but could not be served. Hence Honourable Court ordered for substitute service of notice to above all of you, and ordered for this publication, the above matter posted to 29-07-2025 for all your personal appearance or through your advocate at 10:30 A.M., before the Honourable Court, in the above matter, failing which, the execution petition will be decided on merits in your absence.

(BY THE ORDER OF THE ABOVE HONOURABLE COURT)
(K. Srinivasa Rao, Advocate,
D.No.10-7-60, Ramanagar, Visakhapatnam-02, Ph.9390777170).